క్లుప్తంగా

రెండు టిప్పర్లు, జేసీబీల పట్టివేత



వేలేరు (ధర్మసాగర్) : ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లు, రెండు జేసీబీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం వాహనాలను ధర్మసాగర్ తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

హింస రహిత సమాజాన్ని నిర్మిద్దాం



హన్మకొండ (పరకాల) : హింస రహిత సమాజాన్ని నిర్మిద్దామని అందుకోసం లింగ వివక్షను అరికట్టాలని డా.పల్లెపాడు దామోదర్ అన్నారు. గురువారం పరకాల పట్టణంలోని ఎఫ్‌జె గార్డెన్స్‌లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లింగా ఆధారిత హింసపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల, బాలికలను సమానంగా పెంచాలని, ఆడపిల్లలకు అన్ని రంగల్లో సమానంగా అవకాశాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పరకాల ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యలక్ష్మి, స్వయం సహాయక సంఘాల లీడర్స్, సర్వోదయ ప్రతినిధులు కవిరాజ్, సఖీ కేస్ వర్కర్ వీనిల, శ్రీలత పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యూ బార్ అసోసియేషన్ అంబేడ్కర్ హాల్‌లో న్యాయవాదులకు కాకతీయ ఐ ఆస్పత్రి సిబ్బంది నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.జీవన్ గౌడ్ తెలిపారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కళ్ల ఆరోగ్యానికి తాజా ఆకుకూరలు, విటమిన్ ఏ, పాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ల్యాప్‌టాపులు, కంప్యూటర్లను అధికంగా వినియోగించవద్దని తెలిపారు. న్యాయవాదుల సంఘం నేతలు సుదర్శన్, గోపికారాణి, సాంబశివరాజు, రాజ్‌కుమార్, మాలతి, శ్రుతి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కాజీపేట అర్బన్: బీసీలకు ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు తోట శివ సూచించారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దర్గా పీఏసీఎస్ డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్ యాదవ్, మేకల శ్రవణ్‌యాదవ్, సుంచు ప్రశాంత్, వరికోల్ వీరేందర్, రానాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

‘అక్రమ అరెస్టులు సరికాదు’

వరంగల్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని అసెంబ్లీ ఎదుట ఆందోళన చేసిన పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదని, వారిని వెంటనే విడుదల చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర, జిల్లా నాయకులు కె.గోవర్ధన్, రాచర్ల బాలరాజు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో పీడీఎస్‌యూ నాయకులు బోనగిరి మధు, పి.నాగరాజు, నవీన్, ప్రణయ్‌లతో పాటు ప్రవీణ్, శ్యామ్, నాగరాజు, యశ్వంత్, మహేష్, విజయ్‌తో పాటు 30మంది ఉన్నారని తెలిపారు.

బాధితుడికి పరామర్శ

ఖిలా వరంగల్: ఇటీవల గుండె ఆపరేషన్ చేసుకుని క్షేమంగా ఇంటికి చేరిన న్యాయ వేదిక వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్ కుమార్‌ను న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షులు సాంబయ్య యాదవ్, కొమ్మినేని భూపాల్‌రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామల సుధాకర్, హనుమకొండ జిల్లా కార్యదర్శి మురళీయాదవ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కాజీపేట: కాజీపేట పట్టణంలో గుట్కాలు, అంబర్ ప్యాకెట్లు విక్రయిస్తున్న పలు దుకాణాలపై పోలీసులు గురువారం దాడులు చేశారు. శివాలయం వీధిలోని ఏబీసీ కిరాణం షాపులో టొబాకో, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, షాపు యజమాని గౌరిశెట్టి విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సైలు శివకృష్ణ, లవన్‌కుమార్, అనిల్‌కుమార్‌తో పాటు సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ బెల్స్ @ గుడెప్పాడ్ జంక్షన్



ప్రమాదకరంగా ఉన్న గుడెప్పాడ్ జంక్షన్



గుడెప్పాడ్ జంక్షన్ వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులు (ఫైల్)

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ సెంటర్ (జంక్షన్) రెండు జాతీయ రహదారులకు కూడలిగా ఉంది. ఈ జంక్షన్ గుండా 353సీ, 163 జాతీయ రహదారులు కలిసి ఉన్నాయి. 163 జాతీయ రహదారిలో ప్రయాణికులు ఛత్తీస్‌గఢ్, 353 జాతీయ రహదారిలో మహారాష్ట్రకు ప్రయాణిస్తుంటారు. ఇంత ప్రాముఖ్యమైన జంక్షన్ ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతోంది. ఈ జంక్షన్‌లో తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారుల్లో వందలాదిగా లారీలు రవాణా కొనసాగిస్తుండగా లారీ డ్రైవర్లు నిబంధనలు బేఖాతరు చేస్తూ దూసుకెళ్తున్నారు. జాతీయ రహదారుల సమీపంలోనే పార్కింగ్ చేస్తున్నారు. పార్కింగ్ చేసిన లారీలను ఢీ కొని ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

కొద్ది నెలల క్రితం గుడెప్పాడ్ జంక్షన్‌లో రోడ్డు దాటుతూ ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, ఇదే జంక్షన్‌లో బైక్‌ను లారీ ఢీ కొట్టడంతో భర్త, కుమారుడు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో భార్య మృతి చెందింది. ఈ జంక్షన్‌లో రోడ్డు భద్రత నియమాలు కరువయ్యాయని వాహనదారులు మండిపడుతున్నారు. రోడ్డు కూడా గుంతలు పడి ప్రమాదకరంగా ఉందని వాపోతున్నారు. ఇక్కడికి సమీపంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని అంటున్నారు. స్థానిక పోలీసులు, హైవే అధికారులు సమన్వయంతో ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జంక్షన్ వద్ద ఇన్ని సంఘటనలు జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జంక్షన్ వద్ద సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేసి ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణపై కేంద్రానిది సవతితల్లి ప్రేమ

- సీపీఐ మండల కార్యదర్శి రాములు



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపించిందని సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై సీపీఐ నాయకులు ఎర్రజెండాలతో నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. అనంతరం బడ్జెట్ కరపత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. సాధారణ బడ్జెట్‌లో తెలంగాణ పేరు ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. బీజేపీకి వత్తాసు పలికిన ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు పూర్తిగా అమ్ముడు పోయాయని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపులో కేంద్రం తెలంగాణకు మొండిచెయ్యి చూపించిందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, మండల సహాయ కార్యదర్శి శనిగరం రాజ్‌కుమార్, మండల కార్యవర్గ సభ్యులు తండ మొండయ్య, నిమ్మల మనోహర్, మర్రి విజయ్, సూర మొగిళి, పిన్‌రెడ్డి మోహన్‌రెడ్డి, పోచయ్య, రవీందర్, అయిలయ్య, రాజిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతికి ప్రతీక తీజ్



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతులు

శాయంపేట : గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని మాజీ సర్పంచ్ భూక్యా రమేశ్ అన్నారు. మండలంలోని సూర్యానాయక్‌తండాలో గిరిజన యువతులు తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. యువతులు తొమ్మిది రోజులు అత్యంత నియమనిష్ఠతో పూజలు చేసి తీజ్ ఉత్సవాల చివరి రోజున బుట్ట నుంచి మొలకలు వేరుచేసి పురుషుల తలపై ఉంచి వాటిని ఇళ్లకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అన్నారు. అనంతరం మొలకలను నృత్యాలు, డీజే సౌండ్స్ నడుమ పాటలు పాడుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేస్తారని అన్నారు. తీజ్ ఉత్సవం ముగింపు సందర్భంగా సూర్యనాయక్ తండాలో పండగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలో గ్రామ పెద్ద బానోతు మొగిలి, మాజీ ఎంపీటీసీ రెడ్యానాయక్, ఉపసర్పంచ్ వస్రం, ఆజ్మీరా లక్ష్మణ్, గ్రామ అధ్యక్షుడు రవీందర్, మాలోతు రామన్, బాష, లింగునాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడండి

- జెడ్పీ సీఈఓ విద్యాలత
- ఎల్కతుర్తిలో క్షేత్రస్థాయి పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

ఎల్కతుర్తి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ విద్యాలత ఆదేశించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. వర్షకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో శానిటేషన్ పనులు చేయించాలని, వీధుల్లో చెత్తాచెదారం లేకుండా సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించాలని ఆదేశించారు. ఈజీఎస్ సిబ్బంది వన మహోత్సవ కార్యక్రమం ద్వారా ప్రధాన వీధులగుండా మొక్కలు నాటించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. కేజీబీవీ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే పనులపై అధికారుల్ని వివరాలడిగి తెలుసుకున్నారు. నర్సరీలోని మొక్కల్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఏపీఓ అనిత, పాఠశాల ప్రిన్సిపాల్ అనితాదేవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

క్రీడారంగానికి పెద్దపీట

కాశిబుగ్గ: రాష్ట్ర క్రీడారంగ చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా రూ.325 కోట్ల నిధులు బడ్జెట్‌లో కేటాయించి కొనఊపిరితో ఉన్న క్రీడారంగానికి ఊపిరి పోసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎస్ఏటీజీ కాంట్రాక్ట్ కోచ్ అసోసియేషన్ అధ్యక్షురాలు టీవీఎల్.సత్యవాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిధుల లేమితో మౌనంగా రోదిస్తున్న స్టేడియాలకు నిధుల కేటాయింపుతో తిరిగి ప్రాణప్రతిష్ఠ చేసినట్లయిందని తెలిపారు. ఎంతో మంది యువత, చిన్నారుల క్రీడా భవిష్యత్ కోసం చర్యలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి నిధుల కేటాయింపులో విజయం సాధించిన సాట్ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణి ప్రసాద్‌కు అసోసియేషన్ పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

తాటి మొక్కలు నాటాలి

హసన్‌పర్తి: చెరువు కట్టలపై తాటి మొక్కలు నాటాలని అధికారులను మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు కోరారు. 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు, పుట్టలమ్మ చెరువులను గీతకార్మికులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. నగరం విస్తరిస్తున్న క్రమంలో తాటి చెట్లు, ఈత చెట్లు అంతరించి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హరితహారంలో భాగంగా చెరువు కట్టలపై తాటి, గిరుకతాళ్లు, ఈత మొక్కలను నాటాలని సూచించారు.

రైతులకు నష్టం కలగకుండా చూడాలి



ముంపునకు గురవుతున్న పొలాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : మండలంలోని గుండేడు నుంచి పంగిడిపల్లి వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు ద్వారా ఆ ప్రాంత రైతులకు నష్టం కలగకుండా చూడాలని ఎంపీడీఓ గుండె బాబు ఆదేశించారు. బీటీ రోడ్డు నిర్మాణం వలన భారీ వర్షాలు కురిస్తే ఎగువన ఉన్న పంట పొలాలు జలమయమై ముంపునకు గురవుతున్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన పంచాయతీరాజ్ ఇంజనీర్ రమేశ్‌తో కలిసి గురువారం రోడ్డుకిరువైపుల ముంపునకు గురవుతున్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత మరమ్మతులు చేయించి రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని పంచాయతీరాజ్ ఏఈ రమేశ్‌కు సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూస్తామని చెప్పారు. రైతులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీల్లో సీసీ కెమెరాలతోనే భద్రత



మాట్లాడుతున్న ఏసీపీ నందిరాంనాయక్

కాశిబుగ్గ / రామన్నపేట : కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల భద్రత ఉంటుందని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అన్నారు. ఇటీవల కాలనీలో జరిగిన చోరీలపై 19వ డివిజన్ వివేకానందకాలనీ వాసులకు గురువారం సాయంత్రం అవగాహన కల్పించారు. పోలీసులు భద్రత కల్పిస్తున్నప్పటికీ సీసీ కెమెరాల వల్ల అదనపు భద్రత కలుగుతుందన్నారు. కాలనీలో అనుమానాస్పదంగా ఎవరు కన్పించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లల చర్యలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని, వారు డ్రగ్స్, మద్యానికి అలవాటు కాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని కోరారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి



వరంగల్ చౌరస్తా: ధర్నా చేస్తున్న నాయకులు



హన్మకొండ: దిష్టిబొమ్మను దహనం చేస్తూ..

వరంగల్ చౌరస్తా: రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా, గ్రేటర్ వరంగల్‌కు ప్రభుత్వం మొండిచేయి చూపిందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శించారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో గురువారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ అంగడికి పోయి గొంగడి కొన్న మాదిరిగా ఉందని ఎద్దేవాచేశారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలను ఎందుకు మరిచారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, గందె కల్పన నవీన్ కుమార్, నాయకులు రాణా ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకుల రఘు నారెడ్డి, కాసు శిల్ప, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కార్యదర్శి గడల కుమార్, సుమన్ కత్రి, కిసాన్ మోర్చా నాయకులు సాంబయ్య యాదవ్, ఎస్సీ మోర్చా నాయకులు మాదాసిరాజు, బీజేపీ నాయకులు చిలువేరు రాజేందర్, కూచన క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో హనుమకొండ జిల్లాకు అన్యాయం

హన్మకొండ: రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం హనుమకొండ జిల్లాకు అన్యాయం చేసిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, ఆర్‌పీ జయంత్‌లాల్ విమర్శించారు. ఈమేరకు బీజేపీ ఆధ్వర్యంలో హనుమకొండలోని అమరవీరుల స్తూపం కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో కేయూ అభివృద్ధిని మరిచారని, ఐసీయూలో ఉన్న వైద్య రంగానికి కనీసం ఆక్సిజన్ కూడా ఇవ్వలేని దుస్థితి కల్పిస్తూ ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కైన ఓరుగల్లును హెల్త్ హబ్‌గా చేస్తామని చెప్పి ఒక్కరూపాయి కూడా కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లాకు నిధులు రాకపోవడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేల వైఫల్యమే కారణమని విమర్శించారు. గురుమూర్తి శివకుమార్, శ్రీనివాస్, సారంగపాణి, రవీందర్‌రెడ్డి, అరణ్య రెడ్డి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రాజు, శివ, ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బంధం చెరువు మత్తడి ధ్వంసం



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గల బంధం చెరువు మత్తడిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులను గుర్తించి శిక్షించాలని అధికారులను వేడుకుంటున్నారు. మత్తడిపై ఉన్న లేయర్ వర్షాల కారణంగా ఊడిపోతుండగా నీరు వృథాగా పోతుంది. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖ, గ్రామస్థాయి అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. గతేడాది అధిక వర్షాలతో మత్తడి ధ్వంసం కాగా ఆయకట్టు రైతులు సొంత ఖర్చులతో మట్టిపోసి మరమ్మతులు చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు చేరిందా.. లేదా అని చూసేందుకు వెళ్లిన రైతులకు మత్తడి ధ్వంసమై నీరు వృథాగా పోతూ కనిపించింది. మత్తడిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి శిక్షించాలని రైతులు అధికారులను వేడుకున్నారు.

స్థానిక సంస్థల్లో గెలుపు ఖాయం

ఎల్కతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీజేపీ అభ్యర్థులు బరిలో నిలిచి గెలవాలని సూచించారు. పోటీలో నిలబడే అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్య పరుచాలని సూచించారు. నాయకులు శ్రీవర్ధన్, కిష్టయ్య, వెంకటేశ్, మధుకర్, వినోద్, శ్రీకాంత్, లింగయ్య, శ్రీనివాస్, శంకరయ్య, స్వాతి పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



ఎల్కతుర్తి : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ రహమాన్, డాక్టర్ రూబీనా సూచించారు. ఇంటి కిటికీలకు దోమతెరలు అమర్చుకోవాలని అన్నారు. గురువారం భీమదేవపల్లి మండలం వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలోని కాశ కాలనీలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టి జ్వర పీడితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామస్తులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆహార పదార్థాలను వేడి చేసుకొని భుజించాలని, అలాగే కాచిచల్లార్చిన నీరు తాగాలని సూచించారు. ఇంటి చుట్టూ పనికి రాకుండ ఉన్న కూలర్లు, కొబ్బరిచిప్పలు, గాజు గ్లాసులు, పగిలిన కుండీలు, ప్లాస్టిక్ వస్తువులను దూర ప్రాంతాల్లో పడేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఇంటి పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కెఎల్ఎన్ స్వామి, అజిత, ఆశా కార్యర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులను తొలగించాలి

శాయంపేట : అవినీతికి పాల్పడుతున్న అధికారులను సర్వీస్ నుంచి తొలగించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతికి పాల్పడి ఏసీబీకి పట్టుబడిన పరకాల సబ్ రిజిస్టర్ సునితను, పాల్వంచ టౌన్ ఎస్సై బాణాల రామును సస్పెండ్ చేయడమే కాకుండా వారిని సర్వీస్ నుంచి పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. అవినీతి అధికారులను సర్వీస్ నుంచి తొలగించడం వలన ఇతర అధికారులు లంచం తీసుకోవాలంటే భయపడుతారని అన్నారు. నాయకులు ప్రమోద్, తరుణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

6న చుండూరు మృతవీరుల యాది సభ



కాశిబుగ్గ: ఆగస్టు 6న క్రిస్టియన్ కాలనీ తెలంగాణ జంక్షన్‌లో జరగనున్న చుండూరు మృతవీరుల 33వ వర్ధంతి యాది సభ, ప్రజా యుద్ధనౌక గద్దర్, ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ ప్రథమ వర్ధంతిని విజయవంతం చేయాలని సామాజిక ప్రజాకవుల, కళాకారుల స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గద్దం శరత్ పిలుపునిచ్చారు. ఈమేరకు లేబర్‌కాలనీలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద సభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కవులు, కళాకారులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రాంమూర్తి, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దల కుమారస్వామి, లింగాల ఇమ్మానుయేలు, పోగుల కన్నయ్య, గద్దం సుధాకర్, ల్యాదల్ల భరత్, కంజర్ల జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఫీజు కోసం ఆర్థిక సాయం



విద్యారణ్యపురి: ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న వరంగల్‌కు చెందిన కొంగల హాసినికి ఫీజు చెల్లింపు నిమిత్తం రూ.లక్షా 7వేల 500 విలువగల చెక్కును విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ అందజేశారు. ఈమేరకు ఎస్ఆర్ఐ కొండపెల్లి దీప్తి సహకారంతో హనుమకొండలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో ఒయాసిస్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఒద్దిరాజు ప్రకాశ్ చేతుమీదుగా గురువారం అందించారు. విద్యా ఫౌండేషన్ విజ్ఞప్తి మేరకు హాసినిని దీప్తి దత్తత తీసుకున్నారని, బీటెక్ పూర్తయ్యేంత వరకు కళాశాల ఫీజు చెల్లిస్తారని మహేందర్ వివరించారు.